క్లుప్తంగా

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు



వాసాలతిప్ప ప్రాంతంలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధిలో వాసాలతిప్ప మత్స్యకార ప్రాంతంలో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు అపాయకరంగా పరిణమించాయి. వాసాలతిప్ప గ్రామానికి వెళ్లే వంతెన పక్కన గ్రామానికి విద్యుత్ సరఫరా చేసేలా సిబ్బంది విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ఈ తీగలు వంతెనపై తిరిగే ప్రజలకు చేతికి తగిలే ఎత్తులో ఉన్నాయి. ఈ తీగలతో స్థానికులకు ఏ క్షణాన, ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భోజన పథకానికి కంచాల వితరణ



విద్యార్థులకు కంచాలను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అల్లవరం: ఓడలరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా స్టీలు కంచాలను అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు కేఎస్ఆర్ మూర్తి, రుద్రరాజు రమేష్‌రాజు, మోసుగంటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, పీఎంసీ చైర్మన్ జగతాని నారాయణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ చొల్లంగి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు డస్ట్‌బిన్ల అందజేత



డిపో మేనేజర్‌కు డస్ట్‌బిన్లను అందిస్తున్న ప్రతినిధులు

అమలాపురం రూరల్: ఐఎంఏ, ఓఎన్జీసీ సహకారంతో అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ చొరవతో ఆలిండియా వుమెన్ కార్పొరేషన్, కాకినాడ ఓఎన్జీసీ సాయంతో వీటిని సమకూర్చారు. 120 లీటర్ల, 60 కేజీల కెపాసిటీ ఉన్న 12 నూతన డస్ట్‌బిన్లను బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా వుమెన్ కార్పొరేషన్ కార్యదర్శి ఎన్.భానుమతి, ఎం.మీనాక్షి, డాక్టర్ శర్మ వీటిని అందించారు. ప్రయాణికులకు క్లీన్ అండ్ హైజెనిక్ వాతావరణం కల్పించే దిశలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జి దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ నంది వరహాలబాబు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో కేంద్ర ఆహార, పంపిణీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు రేషన్‌కార్డులో నమోదైన లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ సప్లయిస్ అండ్ కన్స్యూమర్ అఫైర్స్ డైరెక్టర్ ఎస్.సత్యమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. లబ్ధిదారులు తమ దగ్గర్లోని కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)ల్లో ఎటువంటి చార్జీలు లేకుండా, రేషన్‌కార్డు, ఆధార్ కార్డుతో ధ్రువీకరణ చేయించుకోవాలన్నారు. తద్వారా సబ్సిడీలు లబ్ధిదారులకు చేరుతున్నాయో, లేదో పర్యవేక్షించే వీలుంటుందన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్ బాల్ పోటీలు

యానాం: జోనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-17 బాలుర బాస్కెట్ బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని రీజెన్సీ జూనియర్ కళాశాల, ద్వితీయ స్థానాన్ని సాయి జూనియర్ కళాశాల, తృతీయ స్థానాన్ని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు ఐవీకే మోహన్, వడ్డి వరప్రసాద్, కె.రమేష్, వి.సన్యాసిరావు, కె.భాస్కర్, సీహెచ్ వెంకటేశ్వరరావు, సోమేష్, కిరణ్మయి పాల్గొన్నారు.

కోరవితో గోక్కుంటే..

- పెరిగిన విష సర్పాల సంచారం
- వర్షాకాలంలో పాములతో అప్రమత్తం
- ఆస్పత్రుల్లో అందుబాటులో విషం విరుగుడు ఇంజెక్షన్లు

అమలాపురం రూరల్: వివిధ ప్రాంతాల్లో పాముకాటు బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పాముకాటుతో ప్రాణాపాయం సంభవిస్తుంది. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు, కూలీలు, ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన సమయంలో విష సర్పాలు బయట పడుతున్నాయి. కోనసీమ ప్రాంతంలో తాచు, కట్ల పాము, రక్తపింజరి, జెర్రిగొడ్డు తదితర విషపూరిత పాములు ఎక్కువగా ఉన్నాయి. వాటి కాటుకు గురైన బాధితులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు పోయిన ఘటనలూ ఉన్నాయి. అమలాపురం ఏరియా ఆసుపత్రి, ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రితో పాటు, ఆయా నియోజకవర్గాల్లోని అన్ని పీహెచ్‌సీల్లో పాముకాటుకు చికిత్స అందుబాటులో ఉంది. ఇటీవల అమలాపురం ఏరియా ఆసుపత్రి పరిధిలో వివిధ రకాల విషసర్పాల కాటు కేసులను సకాలంలో ఆసుపత్రికి తీసుకొచ్చి, యాంటీ స్నేక్ వీనమ్ అందించటంతో ఎవ్వరికీ ప్రాణాపాయం కలగలేదు. సకాలంలో రాకపోవడం, ఇతర కారణల వల్ల చనిపోయిన కేసులూ ఉన్నాయి. ఇటీవల ముమ్మిడివరం కొత్తలంకలో పాముకాటుకు గురైన ఓ మహిళకు ముమ్మిడివరం ఆసుపత్రిలో వైద్యం అందకపోవడంతో, కాకినాడ తరలిస్తుండగా.. యానాం చేరుకునే సరికి మృతిచెందింది. అంబాజీపేటలో వారం రోజుల క్రితం పాముకాటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీలోని రాజుపాలెం గ్రామంలో గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యనమదల ప్రవల్లిక(27) పాముకాటుకు గురై మరణించింది. ఇటీవల జిల్లావ్యాప్తంగా పది మంది వరకు పాముకాటుతో మృతిచెందినట్లు వైద్య వర్గాలు తెలిపాయి.



రక్తపింజరి



తాచు పాము

సమయమే కీలకం

పాము కాటుకు గురైనప్పుడు వీలైనంత త్వరగా ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణపాయం నుంచి బయటపడవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు పసర మందు, నాటు వైద్యం పేరిట ప్రాణాపాయం కొనితెచ్చుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వాసుపత్రుల్లో పాము కాటుకు విరుగుడు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నా, గ్రామీణ ప్రాంతాల ప్రజలు బాధితులను పట్టణాల్లోని వైద్యశాలలకు తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో సకాలంలో వైద్యం అందక కొందరు మృత్యువాత పడుతున్నారు. పాములు సీజన్ కావటంతో ఆసుపత్రులోను, పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లను వైద్యారోగ్య శాఖ అందుబాటులో ఉంచింది.



పామును చూపుతున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

పాములతో జాగ్రత్త

వర్షాలు, వరదల సీజన్ కావడంతో పాములు పొలాల నుంచి జనావాసాల్లోకి వస్తుంటాయని, వాటితో జాగ్రత్తగా ఉండాలని ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ తెలిపారు. పాముకాటు బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాత్రి చీకట్లో పాము పిల్లలు గడ్డిలో సంచరిస్తుంటాయి. వాటిని గమనించకుండా కాలు వేయడంతో పాముకాటుకు గురవుతున్నారు. రాత్రివేళ బ్యాటరీ లైట్లు వినియోగించి, పాము పిల్లలను గుర్తించవచ్చు. పాములు పొలాలు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, గడ్డివాములు, పాడుబడ్డ ఇళ్లు, ఇటుక గుట్టలు, పేర్చిన కట్టెలు, పెంట దిబ్బల్లో ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఆహారాన్వేషణలో పాములు రాత్రి సమయాల్లో బయటకు వస్తాయి. ఎలుకలు, బల్లులు, తొండలు వంటివి తినేందుకు అవి ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో తిష్ట వేస్తాయి. పాములకు చెవులు ఉండవు కాబట్టి, వాటి శరీర కింద భాగంలో ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహించి సంచరిస్తుంటాయి. వేడి రక్తం ప్రవహించే ఇంతువులు, మనుషులు తారసపడితే వెంటనే గుర్తించి కాటేస్తాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి వాసనలను పాములు భరించలేవు. రాత్రి సమయంలో పొలాల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల రబ్బరు బూట్లు ధరించడం మంచిది. గడ్డిలో పని చేసేవారు చేతికి రబ్బరు తొడుగులు ధరించాలి.

సకాలంలో చికిత్స అందించాలి



పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళనకు గురికాకుండా చూడాలి. బాధితుడికి ధైర్యం చెప్పాలి. కాటు ఉన్న పై భాగంలో తాడుతో గట్టిగా కట్టి, శరీరంలో విషం వ్యాపించకుండా చూడాలి. కాటు ఉన్న ప్రదేశంలో పదునైన బ్లేడ్‌తో గాయం చేసి, రక్తం కారనివ్వాలి. పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించరాదు. కాలయాపన చేయకుండా తక్షణమే సమీప ఆసుపత్రికి తరలించాలి. ప్రస్తుతం ఆసుపత్రుల్లో స్నేక్ వీనమ్ యాంటీ సిరమ్ అందుబాటులో ఉన్నాయి. వెంటనే వైద్యం చేస్తే వ్యక్తి ప్రాణం కాపాడవచ్చు.

– కారెం రవితేజ, వైద్యుడు, అమలాపురం ఏరియా ఆస్పత్రి

నేడు గనికమ్మ ఆలయ వార్షికోత్సవం

అమలాపురం టౌన్: పట్టణంలోని వంటెద్దు వారి వీధిలో వేంచేసి ఉన్న గనికమ్మ ఆలయ 20వ వార్షికోత్సవ పూజలను శనివారం నిర్వహించేందుకు గనికమ్మ అమ్మవారి సేవా సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ పూజలు, అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు అమ్మవారికి కుంకుమ పూజలు చేయనున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మంటపాల యాజమానులు, హోటళ్లు, టిఫెన్ సెంటర్లు, పూలు, పండ్ల వ్యాపారులు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆయా విభాగాల యాజమానులు, వ్యాపారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు వాడరాదని సూచించారు. పర్యావరణ హితమైన అరిటాకులు, వస్త్ర, నార, పేపరు సంచులను విధిగా వినియోగించాలని కోరారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలని చెప్పారు. డ్రైన్లలో వ్యర్థాలను విడిచి పెట్టవద్దని హితవు పలికారు. ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తూనే, మరోవైపు పట్టణాన్ని పూర్తి పరిశుభ్రతగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో పట్టణ పారిశుద్ధ్య సిబ్బంది, వార్డు సచివాలయాల ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయం

అమలాపురం రూరల్: మనుషుల, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలని అమలాపురం ఏడీఏ కెనడీ అన్నారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ సంయుక్తాధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏడీఏ కెనడీ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రాబోయే తరాలకు అవసరమని, రైతులకు అవగాహన కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఆర్‌వైఎస్ఎస్ ఈవీసీ విజయ్‌కుమార్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రీయతపై శిక్షణ ఇచ్చారు. ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ, ఏపీసీఎన్ఎఫ్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పని చేస్తే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని తెలిపారు. డీపీఎం శ్రీనివాస్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం మహిళా సంఘాల ద్వారా ముందుకు తీసుకెళ్లడానికి వేదికలా ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా పీఎండీఎస్ ఏ-గ్రేడ్ మోడల్స్ 365 రోజులు భూమిని పంటలతో కప్పి ఉంచడం, ఏడీఎం మోడల్స్ వంటి శిక్షణ అంశాలతో పాటు, వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్రను వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ మోడల్‌లో 20 సెంట్ల భూమిలో పలు రకాల కూరగాయలను క్రమపద్ధతిలో నాటడం ద్వారా రైతుకు మంచి ఆదాయం లభిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో అతి ముఖ్యమైన ఇన్పుట్ తయారీ విధానాలపై అవగాహన కల్పించారు.



అమలాపురంలో ప్రదర్శన క్షేత్రాలను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

సొసైటీ అధ్యక్షుడిగా పుండరీష్

ముమ్మిడివరం: ఠానేల్లంక సొసైటీ అధ్యక్షుడిగా గోదశి పుండరీష్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. సొసైటీలు బలోపేతం కావడానికి పాలకవర్గాలు కృషి చేయాలని వారు పేర్కొన్నారు.

పొత్తు ధర్మాన్ని విస్మరిస్తున్నారు

టీడీపీ నేతలపై జనసేన నాయకుల ఆరోపణ

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లిలో కూటమి పొత్తు ధర్మాన్ని పాటించకుండా టీడీపీ నాయకులు తమను విస్మరిస్తున్నారని జనసేన గ్రామ కమిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆరోపించారు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు తమ మాటకు విలువ ఇవ్వడం లేదని జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి తాతారావు, ఉప సర్పంచ్ ఉర్రింక రెడ్డి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోరుమిల్లి రాంబాబు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీల నాయకులతో గ్రామ సమన్వయ కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. పదవులు కూడా టీడీపీ నాయకులకే ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ నాయకులు, ఎమ్మెల్యే ఆనందరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

విద్యార్థులకు డీటీవో కౌన్సెలింగ్



విద్యార్థులకు హెల్మెట్ ధరించిన డీటీవో

అమలాపురం రూరల్: కిమ్స్ కాలేజ్ వద్ద ఇటీవల రవాణా శాఖ నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన మోటార్ సైకిళ్ల కోసం ఆర్‌టీఏ కార్యాలయానికి వచ్చిన వైద్య కళాశాల విద్యార్థులకు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా బైక్ నడిపిన విద్యార్థులకు డీటీవో సమక్షంలో లెర్నింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ చేశారు. అనంతరం విద్యార్థులకు హెల్మెట్ ధరింపజేసి, హెల్మెట్ ప్రాధాన్యాన్ని వివరించారు. కాలేజీల వద్ద ఆకస్మిక దాడులు, ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. రెండోసారి పట్టుబడితే రెట్టింపు ఫైన్ కాకుండా, తల్లిదండ్రులు కచ్చితంగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు.

భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



బందారులంకలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: మండలంలో పాత బందారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా భువనేశ్వరి అమ్మవారికి అష్ట ద్రవ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 108 బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ పౌరోహిత్యంలో కొండా హనుమంతరావు దంపతులు కర్తలుగా పూజాది కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం దీపారాధన, ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్‌కు తీవ్ర గాయాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: పేరూరు వై.జంక్షన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైకిస్ట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మామిడికుదురు మండలం పాశర్లపూడికి చెందిన పిల్లి ఆనంద్ మోటార్ బైక్‌పై అమలాపురం నుంచి నగరం వైపు వెళుతున్నాడు. అదే సమయంలో అంతర్వేది నుంచి మురమళ్లకు వస్తున్న కారు అతడిని ఢీకొంది. ఈ ఘటనలో ఆనంద్ కాలు విరగడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు పరిశీలించారు.

పాత నిందితుడి బైండోవర్

అమలాపురం రూరల్: అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో యానాం మద్యం విక్రయించే పాత నిందితుడిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ప్రత్తిపాడుకు చెందిన అద్దాల నరేష్‌ను అమలాపురం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు చెప్పారు. రూ.లక్ష ష్యూరిటీ చూపాలని తహసీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఆదేశించినట్లు తెలిపారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

ఐ.పోలవరం: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరివారి చెరువు ప్రభుత్వ పాఠశాలలో లింగం ఉషారాణి నాలుగేళ్లుగా శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఈమెను తొలగించాలని కొంతకాలంగా ప్రయత్నిస్తున్నట్టు ఉషారాణితో పాటు, మండల నాయకులు లక్ష్మీదేవి, గంగాభవాని, ఇళ్ల సూరిబాబు, సూర్యకుమారి, భద్రావతి తదితరులు తెలిపారు. ఉపాధ్యాయుల నుంచి లిఖితపూర్వక నివేదిక తీసుకుని, ఆమెకు న్యాయం చేయాలని వారు కోరుతూ ఎంఈఓ కొండారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉషారాణి తదితరులు

పలువురికి పొన్నాడ పరామర్శ

తాళ్లరేవు: అనారోగ్యానికి చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పలువురు నాయకుల కుటుంబ సభ్యులను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. కోరంగి పంచాయతీ పాత కోరంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వేగేశ్న రమేష్‌రాజు మాతృమూర్తి గంగాభవానీ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పొన్నాడ తదితరులు పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మరో నాయకుడు పెమ్మాడి సత్యన్నారాయణ(అన్నిబాబు) ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో అన్నిబాబును పొన్నాడ పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, అంకాడి అంజిబాబు, కొపనాతి నాగరాజు, పెయ్యల శ్రీను, నేల శ్రీను, సంగాని శ్రీను, గెద్దాడ బూరియ్య, రేకాడి వెంకటేశ్వర్లు, పొన్నమండ బాబి తదితరులు పాల్గొన్నారు.



పాతకోరంగిలో వేగేశ్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పొన్నాడ తదితరులు

మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘన నివాళి

తాళ్లరేవు: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌కు శుక్రవారం తాళ్లరేవులో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీకి, కేరళ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.ఈశ్వరరావు, వల్లు రాజబాబు, చల్లా సంతోష్‌కుమార్, దడాల వెంకటేశ్వర్లు, అత్తిలి బాబూరావు, మందపల్లి వేణు, సూరిబాబు, చినసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

తాళ్లరేవు: అయినవిల్లి మండలానికి చెందిన దళిత యువకుడు దోనుపాటి మహేష్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందువల్లే దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు స్వాహా చేసిన వారిని వదిలి, మధ్యవర్తిగా ఉన్న మహేష్‌పై దాడి చేయడం దారుణమన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరులుగా చెప్పుకొంటూ, ఉద్యోగాలు ఇప్పిస్తామని దందా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సుభాష్ ఈ దాడిపై స్పందించాలన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు భోజనం

ఐ.పోలవరం: పీఎం శుభదిన్ భోజన్ పథకంలో భాగంగా శుక్రవారం మురమళ్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేశారు. మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు పుట్టినరోజు పురస్కరించుకుని 400 మంది విద్యార్థులకు బిర్యానీ, స్వీట్లు అందించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గమిదే..

అమలాపురం రూరల్: కొత్తగా బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా గనిశెట్టి వెంకటేశ్వరరావు, రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, కె.లక్ష్మి, ఎం.శ్రీనివాస నగేష్, సీహెచ్ కస్తూరి, సీహెచ్ త్రినాథరావు, అడపా శ్రీనివాసరావు, సెక్రటరీలుగా సలాది వీరబాబు, చికురుమిల్లి శ్రీనివాసరావు, కె.దత్తాత్రేయ, కార్యదర్శులుగా ఎన్.సుబ్బరాజు, మోకా ఆదిలక్ష్మి, కె.అనంతలక్ష్మి, ఆర్.వర్మ, సీహెచ్ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా సూర్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆర్.సత్తిబాబు, ఐటీ విభాగం కన్వీనర్‌గా పి.సాయిరాం చౌదరిని నియమించారు. 26 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ముమ్మిడివరం: అయినాపురం శివారు గోదావరి ఒడ్డున కోడిపందేల శిబిరంపై శుక్రవారం ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,100 నగదు, కోడి పుంజు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌కుమార్ తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు శాయ్ క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరిలో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే 26వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారని అకాడమీ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 13 మంది సభ్యుల బృందం స్విమ్మింగ్ పోటీలకు పుదుచ్చేరికి పయనమైనట్లు చెప్పారు.

రక్షణ గోడ నిర్మాణానికి సానుకూల నివేదిక

యానాం: పట్టణాన్ని వరదల నుంచి రక్షించడానికి నిర్మించ తలపెట్టిన వరద రక్షణ గోడకు అనుమతులు మంజూరు చేయడానికి ఏప్రిల్‌లో వచ్చిన కేంద్ర బృందం పనులకు సానుకూల నివేదిక సమర్పించిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఫ్రాన్సుతిప్ప, ఇతర ప్రాంతాల్లో ఎటువంటి కూల్చివేతలు జరగకుండా చూడాలని, దీనిపై ముందుకు వెళ్లవద్దని న్యాయస్థానాన్ని కోరాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. మాస్టర్ ప్లాన్‌లో ఫ్రాన్సుతిప్పని రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్‌గా మార్చాలని ఎల్జీ కె.కైలాషనాథన్‌కు తెలియజేసినట్లు తెలిపారు. మరో 45 రోజుల్లో మాస్టర్ ప్లాన్‌కు అన్ని అనుమతులు రానున్నట్టు వివరించారు.